సాక్షి
వికారాబాద్

సోమవారం । 7 । జూలై । 2025



తండాకు తారు వేయండి

రోడ్డు మంజూరై ఏడాది గడిచింది. కానీ అనుకున్న మార్గం నిర్మించకుండా.. కాంట్రాక్టర్లు కొంత దూరం వేసి ఆపేశారు. 8లో▸



ఆధ్యాత్మికతతో ప్రశాంతత

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 8లో▸



ఆ రోడ్డు గుంతలమయం!

గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి. మరమ్మతులకు నోచుకోక రూపం కోల్పోతున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

బహుజన బంధువు పండుగ సాయన్న

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



సాయన్న విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

పరిగి: పండుగ సాయన్న జీవితం అందరికీ ఆదర్శమని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సామాజిక విప్లవకారుడు సాయన్న జయంతిని పురస్కరించుకొని ఆదివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పరిగి పట్టణంలోని తెలంగాణ కూడలిలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన సాయన్న.. బహుజన బంధువుగా పేరుగాంచాడని పేర్కొన్నారు. ఉన్నవారిని దోచి, పేదలకు పంచాడని తెలిపారు. సాయన్న జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఇప్పటికీ ఆయనను రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో దేవుడిలా కొలుస్తారని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, హన్మంతు ముదిరాజ్, సంఘం గౌరవ అధ్యక్షుడు రాంచంద్రయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జైలు నుంచి వచ్చి.. చోరీకి పాల్పడుతూ

పోలీసులకు చిక్కిన మహిళ



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ సంతోష్‌కుమార్

పరిగి: దొంగతనం కేసులో జైలు జీవితం గడిపిన ఓ మహిళ.. మళ్లీ చోరీలకు పాల్పడి పోలీసులకు చిక్కింది. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం దోమ గ్రామానికి చెందిన ఈడ్గి పద్మమ్మ, పరిగి బస్టాండ్‌లో దోమ బస్సు ఎక్కుతుండగా ఆమె మెడలో నుంచి బంగారు గొలుసు చోరీకి గురైంది. దీంతో ఆమె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దర్యాప్తు ముమ్మరం చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా పట్టణ కేంద్రంలోని తుంకల్‌గడ్డ ప్రాంతానికి చెందిన కావలి అనంతమ్మగా గుర్తించి, ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. బంగారం స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలు గతంలో కొడంగల్ బస్టాండ్‌లో చోరీకి పాల్పడి, జైలు జీవితం గడిపింది. ఏప్రిల్‌లో బెయిల్‌పై బయటికి వచ్చి, తన చేతివాటం కొనసాగిస్తోంది. దొంగను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

సీనియర్ నాయకులకు ప్రాధాన్యం ఇవ్వండి



శివసేనారెడ్డిని కలిసిన వక్కలంక శ్రీనివాసరావు

హుడాకాంప్లెక్స్: సీనియర్ నాయకులకు పార్టీలో ప్రాధాన్యం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య ప్రాంతీయ కార్యదర్శి శ్రీనివాసరావు కోరారు. స్టేట్ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పార్టీ మారకుండా అంటిపెట్టుకుని ఉండి కష్టకాలంలో ఉన్నప్పుడు అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రజాక్షేత్రంలో పనిచేసిన కార్యకర్తలకు న్యాయం చేయాలని కోరారు. దీనికి శివసేనారెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి

బడంగ్‌పేట్: డాక్టర్ శ్యాంప్రసాద్‌ముఖర్జీ సేవలు అందరికీ ఆదర్శమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడలో ఆదివారం పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు వీరకర్ణారెడ్డి ఆధ్వర్యంలో శ్యాంప్రసాద్‌ముఖర్జీ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజ్‌భూపాల్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పిలుమేరకు జిల్లాలో 75 వేల మొక్కలు నాటినట్లు తెలిపారు.



అనంతగిరి: భగవద్గీత పారాయణం చేస్తున్న గీతావాహిని బృందం

ఘనంగా తొలి ఏకాదశి

తొలి ఏకాదశి పర్వదినాన్ని ఆదివారం జిల్లాలో ఘనంగా జరుపుకొన్నారు. ఆలయాలను శోభాయమానంగా అలంకరించారు. అయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.



దుద్యాల్: ఊరేగింపుగా నిమజ్జనానికి బయల్దేరిన పీర్లు

భక్తిశ్రద్ధలతో మొహర్రం

మొహర్రం వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. వీధుల్లో డప్పు వాయిద్యాల మధ్య పీర్లను ఊరేగించారు. పీర్ల చావిడి ఎదుట ఏర్పాటు చేసిన అగ్నిగుండం చుట్టూ అలయ్ ఆడారు. చివరగా సవార్లను నిమజ్జనం చేశారు.



కదలని అమృత్

నిరుపయోగంగా ఉన్న పైపులు

నత్తనడకన తాగునీటి పథకం పనులు

- ఏడాది క్రితం ప్రారంభమైన ట్యాంకులు, పైప్‌లైన్ నిర్మాణాలు
- 10శాతం కూడా పూర్తికాని పనులు
- నాలుగు మున్సిపాలిటీలకు రూ.59 కోట్లు మంజూరు

వికారాబాద్: మున్సిపాలిటీల్లో తాగునీటి అవసరాలను తీర్చేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో చేపడుతున్న అమృత్ 2.0 పథకం పనులు నత్తను తలపిస్తున్నాయి. ఈ పథకం కింద జిల్లాలోని నాలుగు పురపాలికలకు భారీగా నిధులు మంజూరయ్యాయి. పనులు చేపట్టడంలో కాంట్రాక్టర్లు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఈ పనుల పర్యవేక్షణ బాధ్యతలను పబ్లిక్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఇంజనీరింగ్ విభాగం అధికారులకు అప్పగించారు. వారు హైదరాబాద్‌లో ఉంటూ చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారు. పనులు ప్రారంభించి ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకు 10శాతం కూడా పూర్తి చేయలేదు. ఏడాది క్రితం టెండర్ ప్రక్రియను పూర్తి చేసిన అధికారులు 11 నెలల క్రితం నాలుగు మున్సిపాలిటీల్లో పనులను ప్రారంభించారు. గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం కింద గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి వ్యవస్థను బలోపేతం చేయగా ఆ పథకం పనులు పూర్తయ్యాక కొత్తగా ఏర్పాటైన కాలనీల్లో తాగునీటి వ్యవస్థను మెరుగు పర్చేందుకు అమృత్ 2.0 పథకానికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

మంజూరైన నిధులు..

అమృత్ – 2.0 పథకం కింద జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలకు రూ.59 కోట్లు మంజూరయ్యాయి. తాగునీటి సరఫరాను బలోపేతం చేయడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఇందులో భాగంగా మున్సిపాలిటీల్లో ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, పైప్‌లైన్ల ఏర్పాటు, నల్లా కనెక్షన్లు తదితర పనులు చేపట్టాల్సి ఉంటుంది. తాండూరు మున్సిపాలిటీకి రూ.27 కోట్లు, పరిగికి రూ.15.5 కోట్లు, వికారాబాద్‌కు రూ.12 కోట్లు, కొడంగల్‌కు రూ.4.5 కోట్లు మంజూరు చేశారు. ప్రస్తుతం వికారాబాద్ పట్టణ పరిధిలో 68 వేల జనాభా ఉంది. వీరి తాగునీటి అవసరాలు తీర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. అలాగే తాండూరులో 80వేలు, పరిగిలో 35 వేలు, కొడంగల్‌లో 25 వేల జనాభా అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపకల్పన చేశారు.



పరిగి పట్టణ శివారులో ట్యాంక్ నిర్మాణం కోసం పునాది తీసి వదిలేసిన కాంట్రాక్టర్

ప్రస్తుతం అందుబాటులో నీరు

జిల్లాలో రెండు చోట్ల వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు(నీటి శుద్ధి కేంద్రాలు) అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఒకగి పరిగి మండలం జాఫర్ పల్లి సమీపంలో ఉంది. రోజుకు 135 ఎంఎల్‌డీ(మిలియన్ లీటర్ ఫర్‌డే) నీటిని శుద్ధి చేసి పంపింగ్ చేస్తున్నారు. కొడగంల్‌లో 17 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన నీటి శుద్ధి కేంద్రం అందుబాటులో ఉంది. ఇక్కడ రోజుకు 18నుంచి 22 గంటల పాటు నీటిని శుద్ధి చేస్తున్నారు. జిల్లాలో ప్రస్తుత జనాభా 11 లక్షలు కాగా రోజుకు వారి అవసరాలకు 130 ఎంఎల్‌డీ నీరు కావాల్సి ఉంటుంది. ప్రస్తుతం 145 ఎంఎల్‌డీ నీటిని శుద్ధి చేసి పంపింగ్ చేస్తున్నారు. దీంతో పాటు స్థానికంగా ఉన్న మరికొన్ని నీటి వనరులను వినియోగించుకుంటున్నారు. వికారాబాద్ పరిధిలోని శివారెడ్డిపేట్ చెరువు, తాండూరు పరిధిలోని కాగ్నా నది నీటి వనరులు, బోరుబావులను ఉపయోగిస్తున్నారు. పరిగి మున్సిపల్ పరిధిలోని తిరుమల, మైత్రి వెంచర్ కాలనీలు, వేంకటేశ్వర ఆలయ కాలనీలకు రెండేళ్లుగా నీటి సరఫరా ఆగిపోయింది. ఈ కాలనీల్లోని బోరుబావులు కూడా అడుగంటాయి. ప్రస్తుతం వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటి అవసరాలను తీర్చుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితులే మిగిలిన మున్సిపాలిటీల్లో కూడా ఉన్నాయి.

కొన్నది కొంతే.. కొల్లగొట్టింది ఎంతో!

- యథేచ్ఛగా సర్కారు భూముల కబ్జా
- వాగును, కోట్‌పల్లి కాల్వను తన పొలంలో కలుపుకొన్న కబ్జాదారు
- అటవీ, ఇరిగేషన్, రెవెన్యూ భూములు అన్యాక్రాంతం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

ధారూరు: ఇటీవల ఓ వ్యక్తి తన కుమార్తెల పేరిట కొన్న భూమి కొంతైతే.. కబ్జా చేసిందే ఎక్కువని ధారూరు మండలం అల్లాపూర్ గ్రామ రైతులు పేర్కొంటున్నారు. ఇంత జరిగినా సంబంధిత అధికారులు స్పందించపోవటం ఏంటని ప్రశ్నించారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. సదరు వ్యక్తి కొనుగోలు చేసిన భూమికి.. మూడు వైపులా ఉన్న పోతులవాగు, ప్రభుత్వ, ఫారెస్టు భూములు ఉన్నాయని, వాటిని యథేచ్ఛగా తన పొలంలో కలుపుకోవడం అంత సులువైన విషయం కాదని, అందులో పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఫారెస్టు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయ్యాయని విమర్శించారు. ఇరిగేషన్‌శాఖలో గ్యాంగ్‌మెన్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు నిత్యం కోట్‌పల్లి ప్రాజెక్టును పర్యవేక్షిస్తుంటారని, కానీ కాల్వ రోడ్డును తవ్వేస్తే ఎలా వారు ఊరుకున్నారని ప్రశ్నించారు.

అధికారుల ప్రమేయంతోనే..

ప్రాజెక్టు కుడి కాల్వ రోడ్డును దున్నేసి, తన భూమిలో కలుపుకోవడంతో పాటు.. రెండు వైపులా విస్తరించి ఉన్న అటవీ భూమిని ఆక్రమించడం అంత చిన్నవిషయమేమీ కాదని, ఇందులో గతంలో ఇక్కడ పనిచేసిన అధికారుల ప్రమేయం లేకపోలేదని పలువురు రైతులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. రైతుల ఫిర్యాదుతో కలెక్టర్ విచారణకు ఆదేశిస్తేనే భూభాగోతం వెలుగు చూసిందని, అయినా సదరు ఆక్రమణ దారుడిపై పోలీసులు చర్యలు తీసుకునేందుకు జాప్యం చేస్తున్నారని విమర్శించారు. మూడు శాఖల అధికారుల సమన్వయంతో సదరు వ్యక్తి భూమిని సర్వే చేస్తే.. ఎంత ఆక్రమణకు గురైందో బయటపడుతుందని పేర్కొన్నారు. సర్వే నంబర్ 11లో 107 ఎకరాల ఫారెస్టు భూమితో పాటు 22 ఎకరాల రెవెన్యూ భూమి ఉందని ఎఫ్‌ఆర్‌ఓ చెబుతుంటే.. రెవెన్యూ భూమి ఉందనే విషయం తమకు తెలియదని, రికార్డులను పరిశీలించాల్సి ఉందని రెవెన్యూ అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందని రైతులు పేర్కొంటున్నారు.

జాయింట్ సర్వేకు నివేదిక పంపాం



సర్వే నంబర్ 11ను జాయింట్ సర్వే చేయడానికి జిల్లా ఫారెస్టు అధికారికి నివేదిక పంపించాం. వారి ఆదేశాను సారం.. సర్వే అనంతరం ఆక్రమణకు గురైన భూమి ఎంతో తెలుస్తుంది. గతంలో హద్దురాళ్ల వద్ద.. సదరు వ్యక్తి కొంత భూమిని.. తన జాగలో కలుపుకొన్నట్లు అనుమానంగా ఉంది.

– రాజేందర్, ధారూరు ఫారెస్ట్ రేంజర్



పోతులవాగును ఆక్రమించి, మట్టిపోసి రాళ్లు పేర్చిన కబ్జాదారు



పార్టీలో చేరిన వారితో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

విదేశాలకు దీటుగా దేశం అభివృద్ధి

- స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి
- ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

అనంతగిరి: ప్రధాని నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలనలో దేశం.. విదేశాలకు దీటుగా అభివృద్ధిలో దూసుకుపోతోందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం వికారాబాద్‌లోని ఎన్నెపల్లి సమీపంలో బీజేపీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పార్టీకి కార్యకర్తలే పునాదులని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు కృషి చేయాలన్నారు. గ్రూపులు, విభేదాలు పక్కన పెట్టి, కేంద్రం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీ పటిష్టత కోసం పాటుపడాలని సూచించారు. అప్పుడే రాష్ట్రంలో అధికారంలోకి రాగలుగుతామన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ.. సమన్వయంతో పనిచేసి, పార్టీ అభ్యున్నతికి పాటుపడదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు సదానందరెడ్డి, నాయకులు రమేష్‌కుమార్, ఈశ్వరప్ప, నవీన్, దిశా కమిటి సభ్యుడు నందు, శంకర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్

దోమ: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తచాటాలని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో 30 అడుగుల బీజేపీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రధాని మోదీ దేశ ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను అందజేస్తూ.. మెరుగైన పాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం.. ఇచ్చిన హామీలను విస్మరించి, ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో చేరిన కేఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్ కుమార్‌రెడ్డి.. తిరిగి ఎంపీ సమక్షంలో బీజేపీలో చేరగా.. ఆయనకు ఎంపీ కాషాయం కండువాను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్ప, కార్యవర్గ సభ్యుడు ప్రహ్లాదరావు, పరమేశ్వర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రాము యాదవ్, కార్యదర్శి యాదయ్య, కార్యవర్గ సభ్యుడు అనంతయ్య, మండల అధ్యక్షుడు మల్లేశ్, ప్రధాన కార్యదర్శి అశోక్, నర్సింహులు, ఉపాధ్యక్షుడు బాబు, పరిగి మండల అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, బాల్‌రాజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు మట్టి.. పంటకు పుష్టి

- సేంద్రియ ఎరువులపై రైతుల మక్కువ
- పంట దిగుబడి పెంచేందుకు కృషి
- పచ్చిరొట్ట ఎరువుగా జీలుగ, జనుము సాగు
- రసాయనిక ఎరువులు తగ్గించే యోచనలో కర్షకులు



పొలంలో కుప్పలుగా పోసిన చెరువు ఒండ్రుమట్టి

దుద్యాల్: చెరువు మట్టి చేనుకు మేలు చేస్తుంది. వేసవిలో చెరువు నీరు ఎండిపోయినప్పుడు.. అందులోని మట్టిని రైతులు పొలాలకు తరలిస్తుంటారు. వానలు కురిసినప్పుడు పుష్కలమైన పోషక విలువలు కలిగిన సారవంతమైన మట్టి చెరువులో చేరుతుందని, దీనిని వినియోగించడం వలన పంటకు బలం చేకూరడంతో పాటు, దిగుబడి అధికంగా వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. అందుకే సహజ ఎరువుల వాడకానికి రైతులు మక్కువ చూపుతున్నారు.

పచ్చిరొట్ట.. పంటకు బలం

ఆధునిక వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకం అధికమైనప్పటికీ.. క్రమంగా సేంద్రియ సేద్యానికి కర్షకులు మొగ్గుచూపుతున్నారు. దీంతో ఖర్చు తగ్గడమే కాకుండా.. భూసారం పెరిగి, ఆరోగ్యమైన పంటతో పాటు.. దిగుబడి అధికంగా వచ్చేందుకు దోహదపడుతుంది. వాతావరణ కాలుష్య నివారణకు తోడ్పడుతుంది. సహజ ఎరువుల్లో అధికంగా ఉపయోగిస్తున్నది చెరువులోని ఒండ్రు మట్టి. అందులోని నల్లని ఒండ్రు.. సాగుకు మేలు చేస్తుందని వ్యవసాయ అధికారులు, కర్షకులు పేర్కొంటున్నారు. అలాగే పశువుల పేడను, కానుగ పారకను సేంద్రియ ఎరువులుగా పంటకు వినియోగిస్తున్నారు. ఇవి అందుబాటులో లేని సమయంలో పచ్చిరొట్ట ఎరువుగా జీలుగ, జనుము సాగు చేస్తున్నారు. ఏపుగా పెరిగిన తరువాత భూమిలో కలియదున్నుతారు. అప్పుడు ఆ మొక్కలు భూమిలో కరిగి, నేల సారవంతంగా మారుతుంది. ఇది పంటకు బలం చేకూర్చడంతో పాటు.. దిగుబడి అధికంగా వస్తుంది.

పోషకాల గని

చెరువు మట్టిలో అనేక పోషకాలు ఉన్నాయి. నత్రజని, భాస్వరం, పొటాషియం, జింక్, రాగి, బోరాన్ వంటి సూక్ష్మ పోషకాలతో పాటు సేంద్రియ కర్బనం అధికంగా ఉంటుంది. కిలో మట్టిలో 720 మిల్లీ గ్రాముల నత్రజని, 320 మి.గ్రా. భాస్వరం, 310 మి.గ్రా. పొటాషియం, 9 మి.గ్రా. సేంద్రియ కర్బనం, 308 మి.గ్రా. మైక్రోబియల్ బయో కార్బన్ ఉంటుంది. ఇవన్నీ పైరు పెరుగుదలకు ఉపయోగ పడటంతో పాటు.. మట్టిలోని పోషక విలువలు పెంచుతుంది.

పశువుల పేడకు డిమాండ్



ప్రస్తుతం పశువుల పేడ ఎరువుకు డిమాండ్ పెరిగింది. అధిక ధరలకు విక్రయిస్తుండటంతో పెట్టుబడులు పెరుగుతున్నాయి. అందుకే చెరువు ఒండ్రు మట్టిని పొలంలో చల్లాను. ఇది చేనుకు చాలా మేలు చేస్తుంది. దిగుబడి పెంచుతుంది. గతంలో పచ్చిరొట్ట ఎరువుగా జనుము, జీలుగను మూడు సార్లు వినియోగించాను.

– బోయిని సురేశ్, రైతు, హస్నాబాద్

సేంద్రియ సాగుపై దృష్టి



పూర్వ కాలంలో సేంద్రియ వ్యవసాయం చేసేవారు. క్రమంగా కర్షకులు రసాయనిక ఎరువులపై దృష్టి సారించారు. వాటి వలన ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని తెలుసుకున్న రైతులు.. సహజ ఎరువుల వినియోగానికి మక్కువ చూపుతున్నారు. చెరువు ఒండ్రుమట్టి, పశువుల పేడ, జనుము, జీలుగ ఎరువుపై ఆసక్తి కనబర్చుతున్నారు.

– నాగరాజు, వ్యవసాయ అధికారి, దుద్యాల్

క్లుప్తంగా

ఫాంహౌస్‌కు వచ్చిన వ్యక్తి గుండెపోటుతో మృతి

మొయినాబాద్‌: స్నేహితులతో కలిసి పార్టీ చేసుకోవడానికి ఫాంహౌస్‌కు వచ్చిన ఓ వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సంఘటన మొయినాబాద్‌ మండల పరిధిలోని వెంకటాపూర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని అంబర్‌పేట్‌ ప్రాంతానికి చెందిన తిరుమలరెడ్డి భువన మోహన్‌(50) శనివారం సాయంత్రం తన స్నేహితులు ఆరు మందితో కలిసి వెంకటాపూర్‌లోని ఆర్చిడ్‌ మలగా ఫాంహౌస్‌లో పార్టీ చేసుకోవడానికి వచ్చారు. రాత్రి ఫాంహౌస్‌లోనే ఉన్నారు. ఆదివారం ఉదయం భువన మోహన్‌కు చాతిలో నొప్పి రావడంతో వెంటనే చికిత్స కోసం స్థానిక భాస్కర ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అత్తగారింటికి వెళ్తూ.. మృత్యు ఒడికి

బైక్‌ను డీసీఎం ఢీకొని వ్యక్తి మృతి

షాద్‌నగర్‌రూరల్‌: ఎదురుగా వస్తున్న బైక్‌ను డీసీఎం ఢీ కొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని బీవీరావునగర్‌ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుశీల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్‌ జిల్లా బాలానగర్‌ మండలం పెద్దాయపల్లి గ్రామానికి చెందిన విష్ణు(36) తన బైక్‌పై అత్తగారి ఊరైన వెల్జర్లకు బయలుదేరాడు. ద్విచక్రవాహనం బీవీరావునగర్‌ సమీపంలోకి రాగానే ఎదురుగా అతివేగంగా వస్తున్న డీసీఎం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో విష్ణు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సుశీల ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును స్థానికులను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వివాహిత అదృశ్యం


సునీత

మొయినాబాద్‌: డ్యూటీకి వెళ్లిన భర్త తిరిగి ఇంటికి వచ్చే సరికి భార్య అదృశ్యమైంది. ఈ సంఘటన మొయినాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్‌కు చెందిన కొర్ర శివనాయక్‌ ప్రైవేటు జాబ్‌ చేస్తున్నాడు. జూన్‌ 29న శివనాయక్‌ డ్యూటీకి వెళ్లడంతో అతని భార్య సునీత(35) ఇంట్లోనే ఉంది. అదే రోజు సాయంత్రం 4 గంటలకు ఆయన ఇంటికి వచ్చాడు. భార్య ఇంట్లో కనిపించకపోవడంతో చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికాడు. బంధువుల ఇంటికి వెళ్లిందేమోనని భావించాడు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం మొయినాబాద్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యా దు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రాజ్యాధికార సాధనకు సమష్టి కృషి

బీసీసేన జాతీయ అధ్యక్షుడు కృష్ణ

షాబాద్‌: రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలు ముందుకు సాగాలని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని రేగడిదోస్వాడ గ్రామంలో బీసీసేన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామ కమిటీని బీసీసేన మండల అధ్యక్షుడు కమ్మరి దయాకర్‌చారి ఆధ్వర్యంలో అధ్యక్షుడిగా సత్యనారాయణచారి, ఉపాధ్యక్షుడిగా కురుమ శ్రీశైలంను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ఈ సందర్భంగా బర్క కృష్ణ మాట్లాడుతూ.. జనాభాలో సగ భాగమైన బీసీలు సంఘటితమై రాజ్యాధికార సాధన దిశగా ముందుకు సాగాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీలను చైతన్యం చేసి గ్రామ స్థాయి నుంచి బలమైన బీసీ ఉద్యమాన్ని నిర్మించి హక్కులను సాధించునేందుకు కృషి చేయాలన్నారు. మండల స్థాయిలో పేద విద్యార్థులకు సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు ఉన్నావంటే ఆర్‌.కృష్ణయ్య కృషి వల్లనే సాధ్యమైందని చెప్పారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్‌ అమలు చేసి ఎన్నికలకు వెళ్లాలని చెప్పారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీసేన జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌, నాయకులు జలజ, అజయ్‌కుమార్‌, మధుసూదన్‌, రాఘవేందర్‌, మహేందర్‌, జయ, శ్రీకాంత్‌, స్రవంతి, రాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

తండాకు 'తారు' వేయండి

ఎక్కచెరువు తండాకు నిలిచిన బీటీ నిర్మాణం

- 15 నెలలుగా పనులకు అంతరాయం
- ఇబ్బంది పడుతున్న గిరిజనులు


బీటీకి నోచుకోని ఎక్కచెరువుతండా-చిలుముల మైల్వార్‌ రహదారి

దుద్యాల్‌: ఆ మార్గం గుండా రహదారి మంజూరై ఏడాది గడిచింది. కానీ అనుకున్న మేర మార్గం నిర్మించకుండా.. కాంట్రాక్టర్లు కొంత దూరం వేసి చేతులు దులుపుకొన్నారు. దీనికి కారణం పెత్తందారులేనని, వారికి అనుకూలంగా రోడ్డును నిర్మించాలని పట్టుబట్టడంతోనే బీటీ నిర్మాణం నిలిచిపోయిందని ఎక్కచెరువుతండా వాసులు ఆరోపిస్తున్నారు. తండాకు త్వరగా తారురోడ్డు వేయాలని డిమాండ్‌ చేస్తున్నారు.

పది కిలోమీటర్లు.. రూ.5.40 కోట్లు

హస్నాబాద్‌ గ్రామం నుంచి కొడంగల్‌ మండలం పల్లురాళ్ల తండా, దుద్యాల మండలం ఎక్కచెరువు తండా మీదుగా చిలుముల మైల్వార్‌ వరకు సుమారు 10 కిలో మీటర్లకు బీటీ రోడ్డును ప్రస్తుత ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందుకు రెండు విడతలుగా రూ.4.65 కోట్లు, రూ.75 లక్షల నిధులు కేటాయించింది. హస్నాబాద్‌ నుంచి పల్లురాళ్ల తండా వరకు, పల్లురాళ్ల తండా నుంచి జీడిగడ్డ తండా వరకు బీటీని గతేడాది క్రితం సదరు కాంట్రాక్టర్‌ పూర్తి చేశారు. మిగతా పల్లురాళ్ల తండా నుంచి ఎక్కచెరువుతండా మీదుగా చిలుముల్‌ మైల్వార్‌ రోడ్డు నిర్మాణ పనులు నిలిపివేశారు. రోడ్డు వేయడానికి ఏ మార్గంను ఎంపిక చేశారో అలా కాకుండా.. మరో మార్గం నుంచి రోడ్డు వేయాలని చిలుముల మైల్వార్‌ గ్రామానికి చెందిన కొందరు బడా నాయకులు డిమాండ్‌ చేయడంతో రోడ్డు పనులు నిలిచిపోయాయని గిరిజనులు ఆరోపించారు.

సమస్య అంతా ఇక్కడే

కొడంగల్‌ మండలం పల్లురాళ్ల తండా నుంచి ఎక్కచెరువు తండా వరకు రోడ్డు నిర్మాణానికి ఎలాంటి సమస్య లేదు. కానీ ఎక్కచెరువు తండా నుంచి చిలుముల మైల్వార్‌ గ్రామానికి రోడ్డు వేసేందుకు మాత్రం ఆటంకం ఏర్పడింది. ఎక్కచెరువు తండా నుంచి చిలుముల మైల్వార్‌ గ్రామానికి వేసేరోడ్డులో అధికంగా గిరిజనుల భూములే ఉన్నాయి. ఈ మార్గం గుండా 1.5 కిలో మీటర్ల దూరం మాత్రమే ఉంటుంది. అలా కాకుండా అదే గ్రామానికి చెందిన కొందరు బడా నాయకులు వారి పొలాలకు వెల్లే మార్గం గుండా రోడ్డును నిర్మించాలని డిమాండ్‌ చేయడంతో నిర్మాణ పనులు ఆగిపోయాయని గిరిజనులు పేర్కొంటున్నారు. ఆ మార్గం నుంచి రోడ్డు వేసేందుకు అనుమతి లేదని, అలా వేస్తే 3 కిలో మీటర్ల దూరం అధికం అవుతుందని భావించిన కాంట్రాక్టర్లు.. పనులు ఆపేయడం గమనార్హం. ఇదిలా ఉండగా.. తొలుత నిర్ణయించిన ప్రకారమే రోడ్డును నిర్మించాలని కోరినా, నిరసన వ్యక్తంచేసినా అధికారులు పట్టించుకోవడం లేదని గిరిజనులు ఆరోపిస్తున్నారు. పెత్తందారులకు వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. వానాకాలం బురద రోడ్డులో పయనించలేక పోతున్నామని, త్వరగా ఎక్కచెరువు తండా రవాణా మార్గాన్ని మెరుగుపర్చాలని కోరుతున్నారు.


రోడ్డు వేయాలని ధర్నా చేస్తున్న గిరిజనులు (ఫైల్‌)

మరోమార్గం లేదు



ఎక్కచెరువుతండా నుంచి చిలుముల్‌ మైల్వార్‌కు చదువుకోవడానికి చాలా మంది విద్యార్థులం నడిచి వెళ్తుంటాం. రోడ్డు సౌకర్యం సరిగా లేక ఇబ్బంది పడుతున్నాం. వానాకాలం పాఠశాలకు వెళ్లాలంటే రోడ్డంతా గుంతలు ఏర్పడి, బురదమయంగా మారింది. మరోదారి లేక బురదలోనే కాలినడకన రాకపోకలు సాగిస్తున్నాం. అధికారులు స్పందించి బీటీరోడ్డును నిర్మించాలి.

– అర్చన, విద్యార్థి, ఎక్కచెరువుతండా

పెత్తందారుల ఆటంకం



గ్రామాలుగా ఏర్పాటు చేసినప్పటి నుంచి తండాలకు సరైన రోడ్డు సౌకర్యం లేదు. 15 నెలల క్రితం తండాలకు ప్రభుత్వం బీటీరోడ్డు మంజూరు చేసింది. కానీ రోడ్డు పనులకు పెత్తందారులు అడ్డుపడుతున్నారు. ఇదే విషయాన్ని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. రోడ్డును నిర్మించి, తండాల రవాణా మార్గం మెరుగుపర్చండి.

– శివ నాయక్‌, తండావాసి

వ్యక్తిపై వేట కొడవలితో దాడి

- తీవ్రంగా గాయపడిన వ్యవసాయ కూలీ
- నిందితుడిపై హత్యాయత్నం, అట్రాసిటీ కేసు నమోదు


నిందితుడు మహేశ్‌

బషీరాబాద్‌: గొడవ పడుతున్న వారిని నిలువరించడానికి వెళ్లిన వ్యక్తిపై వేట కొడవలితో దాడి చేసిన ఘటన బషీరాబాద్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధి ఎక్మాయి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మహేశ్‌(17) హైదరాబాద్‌లో పని చేస్తుంటాడు. గ్రామంలో మొహర్రం పండగను పురస్కరించుకొని గ్రామానికి వచ్చాడు. అదే గ్రామానికి చెందిన సుంకరి నవీన్‌తో గొడవకు దిగాడు. వీరిద్దరిని విడిపించేందుకు ఎరుకలి మల్రెప్ప వెళ్లగా.. మేం కొట్లాడుకుంటే నువ్వెందుకు మధ్యలో వస్తున్నావని ఆగ్రహిస్తూ.. మహేశ్‌ మల్రెప్పతో గొడవకు దిగాడు. అంతటితో ఆగకుండా వేట కొడవలితో మల్రెప్ప మెడపై నరికాడు. చుట్టపక్కల వారు కొందరు మహేశ్‌ను అడ్డుకుని కొడవలిని తీసుకున్నారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని తాండూరు ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న తాండూరు సీఐ నగేశ్‌, యాలాల ఎస్‌ఐ గిరన్న, బషీరాబాద్‌ పోలీసులు గ్రామానికి వెళ్లి విచారణ జరిపారు. దాడికి పాల్పడిన బాలుడు మహేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందుతుడిపై హత్యాయత్నం, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని డీఎస్పీ బాలకృష్ణారెడ్డి తెలిపారు. బాధితుడు మల్రెప్ప ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఇదిలా ఉండగా.. నిందితుడికి గంజాయి తీసుకునే అలవాటు ఉందని, నగరం నుంచి గ్రామానికి గంజాయిని వెంట తెచ్చుకుని సేవించినట్లు పోలీసుల ఎదుట ఒప్పుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

దుండగులను కఠినంగా శిక్షించాలి

అనంతగిరి: అంబేడ్కర్‌ విగ్రహం చెయ్యి విరగొట్టిన దుండగులను కఠినంగా శిక్షించాలని పలువురు నాయకులు పేర్కొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి..వికారాబాద్‌ పట్టణంలోని రైల్వే స్టేషన్‌ ఎదుట గల అంబేడ్కర్‌ విగ్రహం కుడి చేయిని అర్ధ రాత్రి దాటాక గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టారు. ఈ విషయాన్ని ఉదయం పలువురు అటుగా వెళ్తున్న వారు గమనించారు. ఇది క్రమంగా ఆయా పార్టీల నాయకులు, ప్రజాసంఘాలు, అంబేడ్కర్‌ వాదులకు సమాచారం చేరింది. దీంతో వారు ఘటన స్థలానికి చేరుకుని విగ్రహాన్ని పరిశీలించారు. అనంతరం వారు నిరసన వ్యక్తం చేసి వికారాబాద్‌ పీఎస్‌లో సీఐ భీంకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్‌ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, బీసీ కమిషన్‌ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్‌, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌, మాజీ మున్సిపల్‌ చైర్మన్‌ సత్యనారాయణ, కొత్తగడి రమేశ్‌, మల్లేశం, రవీందర్‌, రాంచందర్‌, ఆనంద్‌, జగదీష్‌, శంకర్‌, సురేశ్‌, పవన్‌కుమార్‌, విజయ్‌, రాజశేఖర్‌, ప్రభాకర్‌రెడ్డి, దేవదాసు, సుభాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వికారాబాద్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

షార్ట్‌ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

పండించిన పంట బుగ్గిపాలు

అనంతగిరి: వికారాబాద్‌ మున్సిపల్‌ పరిధిలోని మద్దులగడ్డ తండాలో ఆదివారం మధ్యాహ్నం షార్ట్‌ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమయ్యింది. ఈ ఘటనలో తన పొలంలో పండించి దాచుకున్న పంట కాలి బూడిదయ్యింది. వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన రమేశ్‌నాయక్‌ వ్యవసాయం చేస్తూ జీవనోపాధి చేసుకుంటున్నాడు. ఆదివారం ఉదయం రోజువారి మాదిరిగానే కుటుంబీకులతో కలిసి పొలానికి వెళ్లారు. ఇదిలా ఉండగా సాయంత్రం 4గంటల సమయంలో ఇంట్లో నుంచి ఒక్కసారిగా మంటలతో పొగలు వ్యాపించాయి. దీన్ని గమనించిన స్థానికులు రమేశ్‌నాయక్‌కు ఫోన్‌ ద్వారా తెలిపి, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం చేరవేశారు. అక్కడికి చేరుకున్న సిబ్బంది మంటలను ఆర్పారు. అప్పటికే బాధితుడు పొలంలో పండించి నిల్వ ఉంచుకున్న 40 బ్యాగుల బియ్యం, 20బ్యాగుల జొన్నలు, 6బస్తాల కందులు, ఇతర పంటలు కాలిపోయాయి. ఈ ఘటనలో దాదాపు రూ. 5లక్షల వరకు నష్టం వాటిల్లిందని రమేశ్‌నాయక్‌ తెలిపారు.


మంటలు ఆర్పుతున్న ఫైర్‌ సిబ్బంది

కఠిన చర్యలు తీసుకోవాలి

అనంతగిరి: వికారాబాద్‌ మండల పరిధిలోని సర్పన్‌పల్లి ప్రాజెక్టులో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న బోటింగ్‌ కేంద్రాలు సీజ్‌ చేసి నిర్వాహకులపై క్రిమినల్‌ కేసు నమోదు చేయాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి గీత ఒక ప్రకటనలో డిమాండ్‌ చేశారు.

కాలనీలను అభివృద్ధి చేసుకోవాలి

మొయినాబాద్‌రూరల్‌: గ్రామీణ ప్రాంతాల్లో కాలనీలు అభివృద్ధి చెందినప్పుడే పట్టణాలుగా రూపాంతరం చెందుతాయని మాజీ స్పీకర్‌ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. ఆదివారం మున్సిపల్‌ పరిధిలోని హిమాయత్‌నగర్‌ సమీపంలో గల పద్మావతి కాలనీ అధ్యక్షుడు జనార్దన్‌రావు మాజీ స్పీకర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలు మున్సిపాలిటీలో కలవడం మంచిదన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌, నాయకులు మల్లేష్‌ యాదవ్‌, రవియాదవ్‌, కాళిదాస్‌, గిరి, కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాకు భూములు కేటాయించండి

టెక్స్‌టైల్‌ పార్క్‌ ఎదుట సొసైటీ సభ్యుల ఆందోళన

నందిగామ: తమకు తెలియకుండా కొంతమంది డైరెక్టర్లు భూములను విక్రయించే ప్రయత్నం చేస్తున్నారని హైదరాబాద్‌ హైటెక్‌ టెక్స్‌టైల్‌ పార్క్‌ సొసైటీలోని సభ్యులు ఆదివారం ఆందోళన వ్యక్తం చేశారు. తమ భూములను కేటాయించాలని మండల పరిధిలోని నర్సప్పగూడ శివారులో టెక్స్‌టైల్‌ పార్క్‌ వద్ద ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా పలువురు సొసైటీ సభ్యులు మాట్లాడుతూ.. 2002–03 సంవత్సరంలో హైదరాబాద్‌ హైటెక్‌ టెక్స్‌టైల్‌ పేరుతో సొసైటీని ఏర్పాటు చేశామన్నారు. అందులో 108 మంది సభ్యులు 8 మంది డైరెక్టర్లు ఉన్నారన్నారు. సొసైటీ పేరుతో నందిగామ మండలంలోని నర్సప్పగూడ శివారులో 143 ఎకరాల భూమిని కొనుగోలు చేసినట్లు చెప్పారు. అందరికీ పెట్టుబడులకు అనుగుణంగా గజాల చొప్పున కేటాయించారని, కానీ తమ పేరున పట్టాలు చేయలేదన్నారు. సొసైటీ పేరుతో కొంతమంది డైరెక్టర్లు తమకు తెలియకుండా కేంద్ర ప్రభుత్వం వద్ద సుమారు రూ.12 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం వద్ద సుమారు రూ.కోటి రుణంగా తీసుకున్నారన్నారు. దాంతో మౌలిక వసతులు ఏర్పాటు చేయాల్సి ఉండగా కేవలం కొంత మంది డైరెక్టర్లకు కేటాయించిన స్థలంలో షెడ్లు నిర్మించి, మిగతా వదిలేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి తీసుకున్న రుణానికి సంబంధించి వాయిదాలు చెల్లించే సమయం ఆసన్నం కావడంతో డైరెక్టర్లు చేతులెత్తుశారని ఆరోపించారు. దాంతో టెక్స్‌టైల్‌ పార్క్‌ ఏర్పాటు 2012లోనే రద్దు అయ్యిందని వివరించారు. నాటి నుంచి నేటి వరకు కొంతమంది ఆ భూమిని తమకు తెలియకుండా అమ్మే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. తాము కష్టపడి సంపాదించిన డబ్బుతో కొన్న భూమిని సొసైటీ పేరుతో ఇష్టానుసారంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా తమ భూములు కేటాయిస్తే పరిశ్రమలు ఏర్పాటు చేయడమే కాకుండా స్థానికులకు ఉపాధి కల్పిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో రమేష్‌, రవి, పురుషోత్తం, రాజేష్‌, వెంకటరమణ, నాగమూర్తి, సురేందర్‌ తదితరులు పాల్గొన్నారు. కాగా అనుమతి లేకుండా టెక్స్‌టైల్‌ పార్క్‌లోకి ఎలా వెళ్తారనే ఫిర్యాదుపై నందిగామ పోలీసులు సొసైటీ సభ్యులను అదుపులోకి తీసుకొని పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు.

లయన్స్‌ క్లబ్‌ ద్వారా నిస్వార్థ సేవలు

డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు: లయన్స్‌ క్లబ్‌ ద్వారా సమాజానికి నిస్వార్థ సేవలు అందుతున్నాయని డీఎస్పీ బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని సల్లా గార్డెన్‌లో లయన్స్‌ క్లబ్‌ తాండూరు శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. లయన్స్‌ క్లబ్‌ సభ్యులు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లయన్స్‌ క్లబ్‌ అధ్యక్షుడిగా శరణబసప్ప, కో ఆర్డినేటర్‌గా రొంపల్లి సంతోశ్‌కుమార్‌, ఉపాధ్యక్షుడిగా మురళిమోహన్‌నమాజి, మహ్మద్‌ యూసూఫ్‌, వీరప్రసాద్‌, కార్యదర్శిగా మంకాల నట్రాజ్‌, సంయుక్త కార్యదర్శిగా గూలీ శివకుమార్‌, ట్రెజరీగా గౌరీ శంకర్‌, సభ్యత్వ నమోదు కమిటీ చైర్మన్‌గా ఓం ప్రకాశ్‌సోమాని, క్లబ్‌ మార్కెటింగ్‌ చైర్మన్‌గా పసారం బస్వరాజ్‌, క్లబ్‌ అడ్మినిస్ట్రేటర్‌గా సల్లాదామోదర్‌, కో ఆర్డినేటర్‌గా బసవప్పతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షుడు శరణబసప్పతో పాటు ప్రతినిధులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో విద్యాభివృద్ధికి లయన్స్‌ క్లబ్‌ సేవలు అభినందనీయమన్నారు. పేదలకు అండగా ఉంటూ దేశంలోనే సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో లయన్స్‌ క్లబ్‌ ముందు వరుసలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌ క్లబ్‌ ప్రతినిధులు రాజుభయంకర్‌, రమేష్‌చంద్రపండిత్‌, గోపాలకృష్ణయాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

తాండూరు: రైతు సంక్షేమమే ధ్యేయంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం తాండూరు పట్టణ శివారులోని వీరశైవ కల్యాణ మండపం సమీపంలో రూ.5 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో 40 లక్షల వరకు రైతు కుటుంబాలు ఉన్నాయని, ఒక్కో కుటుంబానికి కేంద్రం.. ఏటా రూ.90 వేల ఆర్థిక సహాయం అందజేస్తుందని తెలిపారు. తెలంగాణలో 240 లక్షల టన్నుల వరకు ధాన్యం ఉత్పత్తి అవుతోందని, అయితే రాష్ట్రానికి కేవలం 40 లక్షల టన్నులు మాత్రమే అవసరమవుతుందని పేర్కొన్నారు. మిగతా ధాన్యాన్ని కేంద్ర ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేస్తోందన్నారు. ఎఫ్‌సీఐ గోదాముల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోయినా.. రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని వివరించారు. ఏటా తనకు ఎంపీ ల్యాండ్స్‌ కింద రూ.5 కోట్లు వస్తాయని, అయితే దేశంలో ఎక్కడా లేని విధంగా ఇప్పటి వరకు రూ.12 కోట్లతో 200 గ్రామాలకు రోడ్లు వేయించానని వెల్లడించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

సర్పన్‌పల్లి ప్రాజెక్టు ఘటనపై విచారణ చేపట్టాలి

అనంతగిరి: సర్పన్‌పల్లి ప్రాజెక్టులో షికారు చేస్తూ.. బోట్‌ మునిగి ఇద్దరు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ప్రాజెక్టు వద్ద ఘటనా స్థలిని పరిశీలించి, ప్రమాదం గురించి ఆరా తీశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. ఇద్దరు పర్యాటకులు మృతి చెందడం బాధకరమన్నారు. అనుమతులు, శిక్షణ లేకుండా ఇలాంటి బోటింగ్‌లు పెట్టి, ప్రజల ప్రాణాలతో చెలగాట మాడొద్దని హెచ్చరించారు. ఈ ఘటనపై వెంటనే విచారణ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా.. వికారాబాద్‌లోని అంబేడ్కర్‌ విగ్రహం కుడి వేలును గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేయగా.. స్థానిక నాయకులతో కలిసి విగ్రహాన్ని పరిశీలించారు. ఘటనకు కారణమైన వారిని గుర్తించి, కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు చెప్పారు. అదే విధంగా ఇటీవల పట్టణంలో హనుమాన్‌ మందిరంలో విగ్రహం ధ్వంసంకాగా.. ఆలయాన్ని సందర్శించి, విగ్రహాన్ని పరిశీలించారు. ఆయన వెంట పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్‌ రాజశేఖర్‌రెడ్డి, వడ్లనందు, శివరాజు తదితరులు ఉన్నారు.


అనంతగిరి: ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

- ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు

పరిగి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వస్వామి దేవాలయంలో ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామి వారి కల్యాణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తి మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్‌ పార్థసారథి, కమిటీ సభ్యులు గోపాల్‌ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాండురంగస్వామి దేవాలయంలో..

తాండూరు: పట్టణంలోని పాండురంగస్వామి దేవాలయంలో చాతుర్మాసం ప్రారంభం కావడంతో భక్తులు భక్తిశ్రద్ధలతో పాండురంగస్వామివారిని దర్శించుకున్నారు. పట్టణంలోని మల్‌రెడ్డి పల్లి పాండురంగస్వామి దేవాలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామివారికి పల్లకీ సేవ, ఉయ్యాల సేవ పూజాధి కార్యక్రమాలు నిర్వహించారు.

అనంతగిరిలో..

అనంతగిరి: పట్టణం, గ్రామాల్లోని ఆలయాల్లో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. మహిళలు ఉపావాస దీక్షలతో ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.


పరిగి: కల్యాణంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దంపతులు


కొడంగల్‌: దర్శనమిచ్చిన స్వామివారు

దుద్యాల్‌లో..

దుద్యాల్‌: మండల పరిధిలోని హకీంపేట్‌ గ్రామంలో వెలసిన రాకమకొండ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త రాకం యాదయ్య భక్తులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కొడంగల్‌లో..

కొడంగల్‌: పట్టణంలోని పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆషాడ శుద్ధ ఏకాదశి పూజలు నిర్వహించారు. శ్రీవారి మూల మూర్తికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. హిందూ ధార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ విష్ణు సహస్ర పారాయణం చదివారు.

భారతీయ ధర్మం గొప్పది

మోమిన్‌పేట: ప్రపంచంలోనే భారతీయ ధర్మం చాలా గొప్పదని పద్య పద భారతి సాహిత్య సంస్థ గౌరవ అధ్యక్షుడు బందెయ్య గౌడ్‌ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని విఠలేశ్వరాలయంలో పద్య పద భారతి సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని భజనలు, ధార్మిక కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం తొలి ఏకాదశి ప్రాముఖ్యతను, చాతుర్మాస్య విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో పద్య పద భారతి అధ్యక్షుడు రాఘవచార్యులు, తూర్పు మల్లారెడ్డి, కవి గంట మనోహర్‌రెడ్డి, అవధాని మలుగ అంజయ్య, కార్యదర్శి డాక్టరు మున్నూరు రాజు, ఉపాధ్యక్షుడు విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.


తాండూరు: భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారు


మోమిన్‌పేట: విఠలేశ్వరాలయంలో మాట్లాడుతున్న బందెయ్య గౌడ్‌